

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
శనివారం 8 ఫిబ్రవరి 2025



డ్రైడే నిర్వహణతో ఆరోగ్యం

మద్దూరు, ఫిబ్రవరి 7: డ్రైడేతో గ్రామస్థులు ఆరోగ్యంగా ఉంటారని పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని రేబర్తిలో డ్రైడేను పురస్కరించుకుని ఇంటింటికీ తిరిగారు. పలు ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. నీటి నిల్వలతో దోమలు వృ ద్ధి చెందుతాయని వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశాలు యశోద, కవితతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

హృదయ విషాదం



ఉమ్మడి జిల్లాలో నెల రోజుల్లోనే పదుల సంఖ్యలో గుండెపోటుతో మృతి

కూర్చున్నచోటే కుప్పకూలుతున్న పరిస్థితి.. 50 ఏళ్ల లోపువారే అధికం

అకాల మరణాలతో దయనీయంగా కుటుంబాలు

వ్యాయామం లేకపోవడం, ఒత్తిడి, ఆహారపు అలవాట్లే కారణం

ఒకప్పుడు 60 ఏళ్లు పైబడినవారికే అరుదుగా సంభవించే గుండెపోటు ఈరోజుల్లో సర్వసాధారణమైంది. వయసుతో నిమిత్తం లేకుండా గుండెపోటుతో ప్రాణాలను కోల్పోతున్న పరిస్థితి ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆందోళన కలిగిస్తోంది. 30 ఏళ్ల నుంచి 50 సంవత్సరాల వయసు లోపు వారే అధికంగా గుండెపోటుకు గురవుతున్నట్లు తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో గడిచిన నెలరోజుల వ్యవధిలోనే 20 మందికి పైగా గుండెపోటుతో మృతిచెందడం 'ఆంధ్రజ్యోతి' దృష్టికి వచ్చింది. ఈ సంఖ్య ఇంకా ఎక్కువగా ఉన్నా అతిశయోక్తి లేదు.

6 7



సంగారెడ్డి జిల్లా నాగలగిద్ద మండలం మావినెల్లి గ్రామానికి చెందిన సంగమేశ్వర్(38) టిఫిన్ సెంటర్లో పనిచేస్తుంటాడు. ఈ నెల 2వ తేదీన నారాయణఖేడ్‌లోని హోటల్‌లో చట్నీ చేస్తుండగానే గుండెపోటుతో కుప్పకూలి కిందపడిపోయాడు. ఆసుపత్రికి తరలించే లోపే మృతిచెందాడు. అంతకుముందు ఆయనకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవు. ఎలాంటి దురలవాట్లు లేవని కుటుంబ సభ్యులు చెప్పారు.



మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్‌కు చెందిన యాదగిరి(38) సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. జనవరి 17న ఖాజాపూర్‌లోనే గుండెపోటుకు గురై మరణించారు. ఆయనకు ధూమపానం, మద్యపానం అలవాట్లు అసలేలేవు. అకస్మాత్తుగా కుప్పకూలి చనిపోవడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది.



సిద్దిపేటలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఉద్యోగి సుంకరి రమేశ్ విధులు నిర్వహిస్తూనే జనవరి 28న ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే గుండెపోటుతో చనిపోయాడని వైద్యులు ధ్రువీకరించారు. ఎలాంటి దురలవాట్లు లేని 37 సంవత్సరాల రమేశ్ పూర్తి ఆరోగ్యవంతుడు. కానీ గుండెపోటు కబళించడంతో భార్య, ఇద్దరు చిన్నపిల్లల పరిస్థితి దయనీయంగా మారింది.

సర్వేపై అనుమానాలు తగవు

- బీసీలను తక్కువ చేస్తే ప్రభుత్వానికి వచ్చే ప్రయోజనం ఏంటీ?
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం

సిద్దిపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయంగా, చట్టబద్ధంగా జరిగిన బీసీ కుల గణన సర్వేపై అనుమానాలు తగవని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీసీ మేధావులకు, సంఘాల నాయకులకు అనుమానాలు ఏమున్నాయో చెప్పాలని తాను వివరిస్తానన్నారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. బీసీలను తక్కువ చూపెడితే ప్రభుత్వానికి వచ్చే ప్రయోజనం ఏంటని ప్రశ్నించారు. నిన్నటి వరకు అంకెలు లేవని, ఇప్పుడు అంకెలు వచ్చాయని తెలిపారు. 56 శాతం వచ్చిన బీసీల ప్రయోజనాలకు రోడ్ మ్యాప్ తీసుకుని కార్యాచరణ చేపట్టాలని కోరారు. ఇది ప్రారంభమని దీనిని విజయవంతంగా నడపడానికి నాయకత్వం వహించాలన్నారు. గతేడాది ఫిబ్రవరి 4న కేబినెట్‌లో తీర్మానం చేసుకుని ఫిబ్రవరి 16న హుస్నాబాద్ బిడ్డగా బలహీన వర్గాల శాఖ మంత్రిగా అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టానని తెలిపారు. లక్ష మంది ప్రభుత్వ ఉద్యోగులు 1.12 కోట్ల ఇళ్లను తిరిగి సమాచారం సేకరించాలని చెప్పారు. కులగణనలో సమాచారం ఇవ్వని వారు, కుల గణన చేయడానికి ఇష్టం లేని బీఆర్ఎస్, బీజేపీలు ఆరోపణలు చేయడం హస్యాస్పదమన్నారు. ఈ రెండు పార్టీలకు బీసీల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, నాయకులు చిత్తారి రవీందర్, తిరుపతిరెడ్డి, జంగపల్లి అయిలయ్య, చిత్తారి పద్మ, కోమటి స్వర్ణలత, మల్లేశం, బంక చందు తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

'నులి'పురుగులను నివారిద్దాం

- కలెక్టర్ మనుచౌదరి
- జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



జాతీయ నులి పురుగుల నివారణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డీఎంహెచ్‌వో, అధికారులు

సిద్దిపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : నులి పురుగులను నివారిద్దామని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పల్వన్‌కుమార్‌తో కలిసి సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి అవగాహన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. ఈనెల 10న సిద్దిపేట జిల్లాలో నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 2లక్షల42 వేల మంది చిన్నారులకు (ఏడాది నుంచి 19 ఏళ్ల వరకు) అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలను వేయనున్నట్లు తెలిపారు. తద్వారా నులిపురుగుల ద్వారా వచ్చే ఆరోగ్య సమస్యలను అధిగమించవచ్చని, ముఖ్యంగా పిల్లలకు రక్తహీనత, పోషకాహా లోపం, నీరసంగా ఉండడం, చదువుపైన ఏకాగ్రత తగ్గడం, ఆకలి లేకపోవడం వంటి ఆరోగ్య సమస్యల నుంచి కాపాడుకోవచ్చని వివరిం చారు. కార్యక్రమంలో వైద్యఆరోగ్యశాఖతో పాటు ఐసీడీఎస్, విద్యాశాఖ, మున్సిపల్, పంచాయతీరాజ్ విభాగాల సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఏవో నవీన్‌రాజ్ కుమార్, డిప్యూటీ ఎస్‌వో శ్రావణి, ఎఎస్‌వో రమాదేవి, సీనియర్ అసిస్టెంట్ పాషా తదితరులు పాల్గొన్నారు.

వండర్ యోగం

- యోగా రికార్డుకు వేదిక కానున్న సిద్దిపేట
- ఈ నెల 9న శత సహస్ర సూర్య నమస్కారాలకు ఏర్పాట్లు
- వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదుకు సన్నాహాలు



ముందస్తుగా సూర్యనమస్కారాలు సాధన చేస్తున్న యోగా సాధకులు

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే అనేక రికార్డులను సొంత చేసుకున్న సిద్దిపేట సిగలో మరో రికార్డు వచ్చి చేరనుంది. శత సహస్ర (లక్ష) సూర్య నమస్కారాలతో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సిద్దిపేట పేరు లిఖించడానికి ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాల మైదానం వేదిక కానుంది.

ప్రదర్శనను పరిశీలించనున్న వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్

సంపూర్ణ ఆరోగ్యం లక్ష్యంగా సూర్య నమస్కారాలు, యోగా విద్యలో ప్రధాన భూమిక వహిస్తున్నాయి. ప్రపంచానికి ఆరోగ్యాన్ని పంచుతున్న సూర్యునికి అంజలి ఘటిస్తూ 12 ఆసనాలతో సమ్మిళితమైన సూర్య నమస్కారాలు శ్రేష్ఠమైనవని ఋషులు, యోగా గురువులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సిద్దిపేట వ్యాస మహర్షి యోగా సొసైటీ, సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శన కార్యక్రమాన్ని రూపొందించింది. రాష్ట్రస్థాయి సూర్య నమస్కారాల పోటీలను కూడా నిర్వహించడానికి సంకల్పించారు. సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాల మినీ స్టేడియంలో ఈ నెల 9న ఉదయం 6 గంటలకు ఈ వినూత్న కార్యక్రమాలను అమలు చేయడానికి విస్తృతంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ విశేష కార్యక్రమం ద్వారా ప్రపంచానికి ఆరోగ్య సందేశం ఇవ్వడం లక్ష్యంగా నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ అద్భుత ప్రదర్శనను వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు. అనుకున్న లక్ష్యాన్ని దాటిన అనంతరం వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సులో ఈ ప్రదర్శనను నమోదు చేస్తారు.



సూర్యనమస్కారాలు సాధన చేస్తున్న యోగా సాధకులు

ముందస్తు ఏర్పాట్లు

తెలంగాణలో మొట్టమొదటిసారి నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం నెల రోజుల నుంచి నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. యోగ గురువులు తోట సతీష్ సంధ్య ఆధ్వర్యంలో యోగశిక్షకులు కవిత, మంజుల, వాసవి, సంధ్య, సింధూరి, పూజిత, మనీషా, అర్చన, రాములు తదితరులు ప్రత్యేక యోగా శిబిరాలు నిర్వహించి విభిన్న వర్గాలకు సూర్య నమస్కారాల సాధనలో శిక్షణ అందిస్తున్నారు. వికాస్ హైస్కూల్, అంబిటస్ పబ్లిక్ స్కూల్, మెరీడియన్ స్కూల్, క్రాంతి హైస్కూల్, జడ్పీహెచ్ఎస్ ఇందిరానగర్ పాఠశాల, ఎంజేపీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల, మాడ్యులస్ స్కూల్, తడకపల్లి ఆవాస విద్యాలయంలో పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.

20 జిల్లాల నుంచి యోగా సాధకుల రాక

తెలంగాణలోని సుమారు 20 జిల్లాల నుంచి యోగా సాధకులు ఈ విశేష కార్యక్రమంలో పాల్గొనడానికి ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారు రాష్ట్రస్థాయి సూర్య నమస్కారాల పోటీలో పాల్గొనడంతో పాటు శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శనలో భాగం కానున్నారు. 25 ఏళ్ల లోపు వారికి, 25 ఏళ్ల కన్నా ఎక్కువ వయస్సు ఉన్న వారికి ప్రత్యేక పోటీలు జరుగుతాయి. అదేవిధంగా పురుషులకు మహిళలకు, వేరువేరుగా పోటీలుంటాయి. నాలుగు విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారి కోసం సిద్దిపేటలోని వివిధ ప్రాంతాల్లో వసతి సౌకర్యాలను, ఆహారం ఏర్పాటు చేయటం నిర్వాహకులు కల్పిస్తున్నారు. కార్యక్రమంలో సుమారు 1400 మంది యోగ సాధకులు పాల్గొనే అవకాశం ఉంది.

ప్రదర్శనలో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు, మెడల్స్

శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శనలో పాల్గొనే వారు తమ శక్తి మేరకు ఎన్ని సూర్య నమస్కారాలైన చేయవచ్చు. చేసిన సూర్య నమస్కారాలను రికార్డు చేస్తారు. వారు కూడా వండర్ బుక్ ఆఫ్ రికార్డులో భాగస్వామ్యం అవుతారు. అదేవిధంగా పాల్గొన్న వారందరికీ మెడల్స్ సర్టిఫికెట్లను ప్రదానం చేస్తారు. అయితే ప్రదర్శనలో పాల్గొనడానికి ముందుగా పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇక రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రత్యేక మెడల్స్ సర్టిఫికెట్లను అందజేస్తారు. సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ ఈవెంట్ చేయడానికి నిర్వాహకులకు తగిన ప్రోత్సాహం, సహకారం అందిస్తున్నారు. అలాగే పలు హాస్పటళ్లు, సంస్థలు ఆర్థిక సహాయం, మద్దతు ఇవ్వనున్నాయి.

యోగా మనలో భాగం కావాలి



సూర్యుడు మనకు కనిపించే ప్రత్యక్ష దైవం. సూర్య నమస్కారాల వలన రక్త ప్రసరణ సజావుగా జరుగుతుంది. బోన్స్ బలంగా అవుతాయి. నిత్యం సూర్య నమస్కారాలు చేసినట్లయితే వెయిట్ లాస్ కావటంతో పాటు ఆరోగ్యంగా ఉంటాం. రేపు జరిగే మెగా యోగా ఈవెంట్‌లో పాల్గొని వండర్ రికార్డులో భాగస్వాములవుదాం.

- తోట సంధ్య, యోగా శిక్షకురాలు, వ్యాస మహర్షి యోగా సొసైటీ

వండర్ ఈవెంట్‌లో పాల్గొనాలి



రేపు జరిగే మెగా వండర్ ఈవెంట్‌లో ఆరోగ్యాభిలాషులు, యోగా సాధకులు అధిక సంఖ్యలో భాగస్వాములు కావాలి. రిజిస్ట్రేషన్ చేసుకోని వారు వెంటనే పేరు నమోదు చేసుకోవాలి. ప్రస్తుతం మారుతున్న పరిస్థితుల వల్ల అందరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాల్సిందే. కొత్త రోగాల రూపంలో ఆపదలు వస్తున్నాయి. కాబట్టి ప్రతిరోజు యోగా చేయటం అలవాటు చేసుకోవాలి. కనీసం సూర్య నమస్కారాలు ప్రాక్టిస్ చేసినా కూడా మంచి ఫలితాలుంటాయి. అనారోగ్యం బారినపడి ఇబ్బంది పడేకంటే ముందే ఆరోగ్యాలు కాపాడుకోవాలి.

- డాక్టర్ అరవింద్‌కుమార్, దంత వైద్యుడు, చైర్మన్ వ్యాసమహర్షి యోగా సొసైటీ



సిబ్బందితో మాట్లాడుతున్న సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

పన్నులు సకాలంలో చెల్లించాలి

- సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ఆస్తి, నల్లా పన్నులను సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని సిద్దిపేట పట్టణ ప్రజలకు మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సూచించారు. శుక్రవారం సిద్దిపేటలోని మున్సిపల్ కార్యాలయంలో ఆస్తి, నల్లా పన్ను పై సిబ్బందిని ఆరా తీశారు. పట్టణంలో నిర్మాణాలు పూరైన ప్రతీ ఒక్క భవనానికి ఇంటి నంబర్ జారీ చేయాలని, కమర్షియల్ షెడ్‌లు, పెట్రోల్ బంక్‌లు వంటి వాటికి ఇతర గోదాములకు నంబర్ లేకుంటే తప్పనిసరిగా ఇంటి నంబర్ జారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యంగా కమర్షియల్ భవనాల యజమానులు తప్పనిసరిగా 10 రోజుల లోపు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించి తప్పనిసరిగా ఇంటి నెంబర్ తీసుకోవాలని సూచించారు. లేదంటే మున్సిపల్ చట్టం 2019 ప్రకారం వారిపై చర్యలు తీసుకోబడుతుందని హెచ్చరించారు. పట్టణంలో నూతన గృహ యజమానులు తప్పనిసరిగా అనుమతులు తీసుకుని నియమ నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కోడ్ ఉన్నందున ఫ్లెక్సీలను తొలగించాలి

ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినందున ఎన్నికల కోడ్‌లో భాగంగా మున్సిపల్ పరిధిలో ఎంసీసీ (మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) బృందాన్ని ఏర్పాటు చేసి మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు కోడ్ అమలులో ఉన్నందున పట్టణంలో రాజకీయపరమైన ఫ్లెక్సీలు, బ్యానర్లు, వాల్ పోస్టర్లు తొలగించాలని ఎంసీసీ బృందాన్ని ఆదేశించారు. ఎవరైనా రాజకీయపరమైన ప్రచార ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు వేయదలచినట్లైతే ఆర్‌డీవో అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

కోల్‌కతా మ్యాచ్ మరుపురానిది

- సత్యసాయి సేవలు విశ్వవ్యాప్తం కావాలి
- మానవత్వమే సాయి తత్వం
- మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్

7



సమగ్ర విచారణ చేయిస్తాం

- పేద, మధ్య తరగతి ఆస్తుల పరిరక్షణకు కృషి : హైడ్రా కమిషనర్ రంగనాథ్
- ఐలాపూర్‌లోని వివాదాస్పద రాజగోపాల్‌నగర్ భూముల పరిశీలన
- కేసు హైకోర్టులో విచారణలో ఉండగా ఎలా వస్తారని కమిషనర్‌ను నిలదీసిన అడ్వకేట్

7

సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సోషల్‌మీడియాతో సైబర్ నేరగాళ్లబారిన పడే ప్రమాదముందని, అందువల్ల సోషల్ మీడియాను అవసరమైనంత వరకు మాత్రమే ఉపయోగించాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను విద్యార్థులకు సూచించారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని చెప్పారు. షీ టీం ప్రాముఖ్యతను వివరించారు. పోక్సో చట్టం, బాల్య వివాహలు, వాటి పరిణామాల గురించి వివరించారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ ల గురించి అవగహన కల్పించారు.



విద్యార్థులకు బుక్స్ అందజేస్తున్న రూరల్ సీఐ శ్రీను

వృక్ష విలాపం

- రోడ్డు విస్తరణలో కనుమరుగవుతున్న మహావృక్షాలు
- దశాబ్దాల నాటి 140 భారీ చెట్ల తొలగింపు
- రీలొకేషన్ చేయాలని పర్యావరణ ప్రేమికుల డిమాండ్

జోగిపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆ రోడ్డు వెంట వెళ్తుంటే మండు వేసవిలోనూ చల్లని గాలులు పలకరిస్తాయి. భానుడి ప్రతాపం తెలియకుండా మహావృక్షాలు గొడుగు పడతాయి. హైవేపై వెళ్లే వారు తప్పకుండా ఆగి సేదతీరుతారు... కొద్దిరోజుల్లోనే ఇదంతా గతంగా మారనుంది. రోడ్డు వెడల్పు కోసం దశాబ్దాల క్రితం నాటిన వృక్షాలు కోతకు గరవుతున్నాయి. జోగిపేట నుంచి అన్నాసాగర్ వరకు 1.8 కిలోమీటర్ల రహదారికి ఇరువైపులా వందేళ్ల క్రితం మర్రి, రావి, వేప మొక్కలను నాటారు. అవి నేడు మహావృక్షాలుగా విస్తరించాయి. కాగా, ఇటీవల అందోలు-జోగిపేట మున్సిపల్ పరిధిలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. ఇందుకోసం ఇరువైపులా 170 మహావృక్షాలు తొలగించాలని గుర్తించారు. సంగుపేట నుంచి అందోలు వరకు చేపట్టనున్న తొలిదశ విస్తరణలో 70 చెట్లను తొలగిస్తున్నారు. రెండో దశలో జోగిపేట సత్యసాయి కాలనీ నుంచి అన్నాసాగర్ 68 వృక్షాలను తొలగించనున్నారు. దశాబ్దాల నుంచి నీడనిస్తున్న వృక్షాలు ఆనవాళ్లు లేకుండా పోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనుల కోసం చెట్ల తొలగింపు తప్పనిసరి అయినప్పటికీ.. పూర్తిగా కొట్టేయకుండా 'రీలొకేషన్' చేసే అవకాశాలను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. మొక్కలను నాటి దశాబ్దాలకు సంరక్షించేందుకు అయ్యే వ్యయప్రయాసలను పరిగణలోకి తీసుకుంటే దశాబ్దాల నాటి ఈ వృక్షాలను మరోచోటకు తరలిస్తే ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.



రోడ్డు విస్తరణ కోసం ఇరువైపులా పెరిగిన వృక్షాలను నరికేస్తున్న కూలీలు

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

గజ్వేల్ ప్రజ్ఞాపూర్, వర్గల్‌లో పది పరీక్ష కేంద్రాల్లో నిర్వహణ

వర్గల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-2026 విద్యా సంవత్సరంలో ఖాళీ ఏర్పడిన సీట్ల భర్తీకి శనివారం నిర్వహించే ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ శుక్రవారం తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 9వ తరగతి ప్రవేశ పరీక్షకుగానూ 989 మంది విద్యార్థులు, ఇంటర్ ప్రవేశ పరీక్షకుగానూ 1,621 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. గజ్వేల్, ప్రజ్ఞాపూర్, వర్గల్‌లో 10 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద ఒక సూపరింటెండెంట్, ఒక సెంట్రల్ లెవల్ అబ్జర్వర్ ఉంటారన్నారు. 24 మంది విద్యార్థులకు ఒక గది, ఒక ఇన్విజిలేటర్‌ను ఉంటారని తెలిపారు. 9వ తరగతి ప్రవేశ పరీక్ష శనివారం ఉదయం 11.15 గంటల నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకు, ఇంటర్ ప్రవేశ పరీక్ష ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించబడుతుందన్నారు. అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని నవోదయ ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులు అడ్మిట్ కార్డు, రైటింగ్ ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తీసుకొని రావలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు పోలీస్ కమిషనర్ ఆదేశానుసారంగా సీఆర్‌పీసీ 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

కార్పొరేట్లు, రియల్టర్ల ఉచ్చులో పడొద్దు

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కూర రఘోత్తంరెడ్డి




సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు కార్పొరేట్లు, రియల్టర్ల ఉచ్చులో పడి మోసపోయి ఓట్లు వేయొద్దని ఉమ్మడి మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉపాధ్యాయల ఎమ్మెల్సీ అభ్యర్థి కూర రఘోత్తంరెడ్డి స్పష్టం చేశారు. సంగారెడ్డిలోని ఎస్టీయూ భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయ మాట్లాడారు. డబ్బు, అహంకారంతో 10 వేల ఓట్లను కొనేసి చట్టసభల్లోకి రావాలన్న దురుద్దేశంతో వారు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. 30 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా సేవలందించానని, ఆరేళ్ల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పనిచేశానని, ఉపాధ్యాయులు, పాఠశాలల్లో తనకు అవగాహన ఉందన్నారు. ఆరేళ్ల ఎమ్మెల్సీగా ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపానని తెలిపారు. మరోసారి ఆదరిస్తే ఉపాధ్యాయుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతానని పేర్కొన్నారు. అంతకుముందు తారా కళాశాల మైదానంలో ఉపాధ్యాయ ఓటర్లతో ఆయన వాకింగ్ చేశారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సాబేర్‌అలీ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రాథోడ్ పాల్గొన్నారు.














వాగు నుంచి నీటి తరలింపునకు ప్రయత్నాలు

● అర్ధరాత్రి పైపుల కోసం తవ్వకాలు



పైపులైన్ వేసేందుకు తవ్విన దృశ్యం

తూప్రాన్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి) : హల్దీవాగు నుంచి అక్రమంగా నీటిని తరలించేందుకు అర్ధరాత్రి సమయంలో ఏకంగా రోడ్డునే తవ్వి పైపులైన్లు వేసిన సంఘటన తూప్రాన్ మండల పరిధిలో చోటుచేసుకున్నది. తూప్రాన్ మండలం యావపూర్ శివారులో హైదరాబాద్‌కు చెందిన ఓ నాయకుడు సీలింగ్, పట్టా భూములను కొనుగోలు చేశాడు. ఆ భూములకు నీటిని తరలించేందుకు కొందరి రైతులతో జతకట్టాడు. కిష్టాపూర్ శివారులోని హల్దీవాగు నుంచి పైపులైన్లు వేసి నీటిని తరలించే ప్రయత్నాలు చేపట్టారు. గతంలో రైతులు అడ్డుకుని అధికారులకు ఫిర్యాదు చేయడంతో నిలిపేశారు. యాసంగి పంటలు ఎండిపోతున్నాయని రైతుల వినతి మేరకు హల్దీ వాగులోకి నీరు విడుదల చేయడంతో మళ్లీ పైప్‌లైన్ వేసే పనులు ప్రారంభమయ్యాయి. గురువారం అర్ధరాత్రి రోడ్డు భవనాల శాఖకు చెందిన రోడ్డును తవ్వేసి పైపులైన్లు వేశారు. అక్రమ నీటిని తరలింపును అడ్డుకోకుంటే ఆందోళనలు చేస్తామని రైతులు హెచ్చరించారు.

సిద్దిపేట డాక్టర్‌కు వైద్య శిరోమణి అవార్డు

● అందజేసిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



భాస్కర్‌కు అవార్డును అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

సిద్దిపేట, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని లోహిత్ సాయి ఆసుపత్రి చైర్మన్, వైద్యుడు భాస్కర్‌కు వైద్య శిరోమణి అవార్డు లభించింది. హైదరాబాద్ త్యాగరాయ గానసభలో తేజస్విని కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అవార్డు ప్రదానం చేశారు.

200 కిలోల గంజాయి స్వాధీనం

● నిందితుడికి రిమాండ్

మదీన, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్ రాష్ట్ర గంజాయి సరఫరా నిందితుడిని సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్, చాంద్రాయణగుట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.50 లక్షల విలువ చేసే సుమారు 200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ వివరాలను వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా, నగిలిగిద్ద మండలం, మేఘ్యానాయక్ తండాకు చెందిన జాదవ్ వసురామ్ కుమారుడు జాదవ్ శివరాం(34) డ్రైవర్‌గా పనిచేస్తూ గంజాయి వ్యాపారం కూడా చేస్తుంటాడు. ఏపీలోని సీలేరు, అల్లూరి సీతారామరాజు జిల్లా, ఒడిశాలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలించి ఎక్కువ ధరకు అమ్ముతుంటాడు. మూడు రోజుల క్రితం కారులో ఒడిశా వెళ్లి సుభాష్ అనే వ్యక్తిని సంప్రదించాడు. అతడి వద్ద కిలో గంజాయి రూ.4 వేల చొప్పున 200 కిలోలు కొనుగోలు చేసి శంషాబాద్‌కు తీసుకొచ్చాడు. ఈనెల 5వ తేదీన తన వ్యాపార భాగస్వామి అయిన బానావత్ జైపాల్‌తో చర్చించాడు. అతడు ఎల్బీనగర్‌కు రమ్మని చెప్పగా.. కారులో గంజాయి తీసుకుని వెళ్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు చాంద్రాయణగుట్ట ఫ్లైఓవర్ వద్ద అతడిని అదుపులోకి తీసుకుని గంజాయి, కారు స్వాధీనం చేసుకున్నారు. విచారించగా.. 2015 నుంచి గంజాయి సరఫరా చేస్తున్నట్లు జాదవ్ శివరాం అంగీకరించాడు. స్వాధీనం చేసుకున్న గంజాయి, కారు, రెండుసెల్‌ఫోన్ల విలువ సుమారు రూ. 50లక్షలు ఉంటుందని డీసీపీ తెలిపారు. జాదవ్‌ను రిమాండ్‌కు తరలించారు. సుభాష్, బానావత్ జైపాల్ పరారీలో ఉన్నారని వివరించారు. విలేకరుల సమావేశంలో సౌత్‌ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ టి.స్వామి, చాంద్రాయణగుట్ట ఏసీపీ కె.మనోజ్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సైదబాబు, చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ కె.గురునాథ్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

కొండపాక, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతిచెందిన సంఘటన కొండపాక మండలం దుద్దెడ శివారులో సేలంపు వద్ద శుక్రవారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన దొండకాయల కనకయ్య (50) మృతదేహం చెట్ల పొదలలో పడి ఉంది. ప్రస్తుతం ఆయన సిద్దిపేట హనుమాన్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆయన మెడ చుట్టూ కమిలిన గాయం ఉంది. దీన్నిబట్టి ఎవరో చంపి తీసుకువచ్చి ఇక్కడ పడేసినట్టు భావిస్తున్నారు. సిద్దిపేట త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



క్రైం కార్నర్

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

- ఇద్దరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- మృతులు, క్షతగాత్రులు రామగుండం వాసులు



లారీని ఢీకొని నుజ్జునుజ్జయిన కారు

గజ్వేల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టిన సంఘటన సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారిపై శుక్రవారం వేకువజామున చోటుచేసుకున్నది. సీఐ సైదా తెలిపిన వివరాలు ప్రకారం.. పెద్దపల్లి జిల్లా రామగుండం పరిధిలోని న్యూపోరట్‌పల్లి గ్రామానికి చెందిన మెరుగు లింగయ్య(52), తన తమ్ముడు మెరుగు మహేష్(43), మేనఅల్లుడు మురికి బినేష్(29) ముగ్గురు కలిసి అదే గ్రామానికి చెందిన తిరుపతి కారులో ఆయన డ్రైవర్ కుందేళ్ల ప్రణయ్‌సాగర్‌తో కలిసి హైదరాబాద్‌కు సొంత పని నిమిత్తం శుక్రవారం వేకువజామున ఒంటిగంటకు బయలుదేరి వస్తున్నారు. ఈ క్రమంలో ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారిపై పక్కన నిలిపి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముషి. బినేష్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందగా, మిగిలిన వారిని గజ్వేల్ 108 సహాయంతో ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ లింగయ్య మృతిచెందగా, మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ యశోధ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ ప్రణయ్‌సాగర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అజాగ్రత్తగా ఎటువంటి సిగ్నల్స్ లేకుండా రోడ్డుపై వాహనాన్ని నిలిపిన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని మెరుగు లింగయ్య కుమారుడు మెరుగు అభిషేక్ గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా తెలిపారు. మృతదేహాలకు శవపరీక్షలు నిర్వహించి వారి కుటుంబసభ్యులకు అప్పగించారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

తూప్రాన్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా 40 క్వింటాళ్ల రేషన్ బియ్యంను తరలిస్తుండగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి పట్టుకున్న సంఘటన శుక్రవారం తూప్రాన్ పరిధిలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సూరారం నుంచి మెదక్ జిల్లా రామాయంపేటకు రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ పరంజ్యోతి ఆధ్వర్యంలో సిబ్బంది అప్రమత్తమయ్యారు. శుక్రవారం తెల్లవారుజామున తూప్రాన్ పట్టణ శివారులోని అల్లాపూర్ టోల్‌ప్లాజా వద్ద 40 క్వింటాల రేషన్ బియ్యంను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. సూరారంకు చెందిన లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పట్టుబడిన రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు.

నీలగిరి చెట్లు నరికిన ఇద్దరిపై కేసు

- ఛార్జింగ్ చైన్ మెషిన్ స్వాధీనం

శివ్వంపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : అల్లీపూర్ బీట్ భీమ్లా తండాలో నీలగిరి చెట్లను నరికివేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తూప్రాన్ ఎఫ్ఆర్‌వో అంబర్‌సింగ్ తెలిపారు. శుక్రవారం భీమ్లాతండాలో పోలీసులు, అటవీ శాఖ సిబ్బంది కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు చేసి ఛార్జింగ్ చైన్ మెషిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్లాంటేషన్‌లో చెట్లను నరికిన కేతావత్ ప్రవీణ్, మాన్‌సింగ్‌లపై కేసు నమోదు చేశారు. అటవీ భూముల్లో చెట్లు నరికివేస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదని ఎఫ్ఆర్‌వో అంబర్‌సింగ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ కిరణ్, బీట్ ఆఫీసర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హృదయ విషాదం



ఉమ్మడి జిల్లాలో నెల రోజుల్లోనే పదుల సంఖ్యలో గుండెపోటుతో మృతి

- కూర్చున్నచోట కుప్పకూలుతున్న పరిస్థితి
- మృతుల్లో 50 ఏళ్ల లోపువారే అధికం
- అకాల మరణాలతో దయనీయంగా కుటుంబాలు
- వ్యాయామం లేకపోవడం, ఒత్తిడి, ఆహారపు అలవాట్లే కారణం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 7 : గుండెపోటుతో హఠాన్మరణాలు పెరిగిపోతున్నాయి. చిన్నవయసులోనే హార్ట్‌ఎటాక్‌తో మరణిస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో నెలరోజుల్లో పదుల సంఖ్యలో గుండెపోటుకు గురై మృతిచెందారు. పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ ఆహారపు అలవాట్లు మారిపోయాయి. జంక్‌ఫుడ్లు, ఫాస్ట్‌ఫుడ్, మసాలాలు, బిర్యానీలు ఎక్కువగా తినడం సమస్యలకు కారణమవుతోంది. దీంతో పాటు ఒత్తిడి, మానసిక ఆందోళన, బీపీ, డయాబెటీస్ వంటివి తోడై గుండె పనితనం మందగించి కుప్పకూలుతున్నారు.

పెరుగుతున్న ఈసీజీ టెస్టులు

గుండె పనితీరును అంచనా వేయడానికి ప్రాథమికంగా చేపట్టే వైద్యపరీక్ష ఈసీజీ. సిద్దిపేటలోని ఓ ల్యాబ్‌లో గతంలో రోజుకు ఒకటికి మించి ఈసీజీ పరీక్షలకు వచ్చేవారు కాదు. కానీ ఇటీవల కాలంలో రోజుకు 10 నుంచి 20 మంది ఈసీజీ టెస్టులు చేయిస్తున్నారు. అదేవిధంగా టుడిఈకో, ట్రేడ్ మిల్ టెస్టుల కోసమూ వెళుతున్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లా కేంద్రాలతోపాటు పటాన్‌చెరు, రామచంద్రాపురం, నర్సాపూర్, గజ్వేల్, సదాశివపేట, జహీరాబాద్ పట్టణాల్లోని ల్యాబ్‌లలోనూ ఈసీజీ పరీక్షల సంఖ్య పెరిగినట్లుగా చెబుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని ల్యాబ్‌లలోనూ ఈసీజీ పరీక్షలను చేపట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్యాస్ ట్రబుల్ కారణంగా కూడా ఛాతీ వద్ద నొప్పి వస్తుందని, ఇలాంటి సమయంలో భయాందోళనలకు గురై మరింత ఒత్తిడికి లోనవుతున్నారని వైద్యులు అంటున్నారు. సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రస్తుతం గుండె వైద్య చికిత్సలు అందుబాటులోకి వచ్చాయంటే గుండెపోట్ల ప్రభావాన్ని అర్థం చేసుకోవచ్చు.

కుటుంబాలు చిన్నాభిన్నం

కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న వ్యక్తి ఒక్కసారిగా గుండెపోటుతో చనిపోవడంతో ఆ కుటుంబాల పరిస్థితి దిక్కుతోచకుండా అవుతున్నది. 30 నుంచి 50 ఏళ్ల వయసులోనే కాలం చేయడంతో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. ఇటీవల కాలంలో చనిపోయినవారి కుటుంబాల్లోని పిల్లలంతా పాఠశాలలు, కాలేజీల్లో చదువుతున్నవారే. ఇంటిపెద్ద కష్టపడితేనే బతుకును సాగించే పరిస్థితి. ఇప్పుడు ఆ ఇంటిపెద్ద లేకపోవడంతో ఆర్థిక సమస్యలతోపాటు మానసికంగా కుంగిపోతున్నారు. చిన్నవయసులోనే మహిళలు వైధవ్యాన్ని అనుభవిస్తున్నారు. తండ్రి అడుగుజాడల్లో నడిచిన ఆ పిల్లలు నాన్నా అనే పిలుపునకు దూరమవుతున్నారు. ఈ కుటుంబాలను కదిలిస్తే కన్నీళ్లే రాలుతున్నాయి.

చిన్నవయసులోనే 'చితి'కిపోయి..

- నార్సింగి మండల కేంద్రానికి చెందిన ఆకుల శ్రీనివాస్‌గౌడ్(48) జనవరి 11న గుండెపోటుతో మరణించాడు. ఆయన భార్య ఆకుల జ్యోతి సైతం ఈనెల 3వ తేదీన గుండెపోటుతోనే చనిపోవడంతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొన్నది.
- రాయికోడు మండలం కుసునూరుకు చెందిన వడ్డె లాలప్ప(48) అస్వస్థతకు గురికాగా బీదర్ ఆస్పత్రికి తరలించి ఈసీజీ తీయగా గుండెపోటు అని తేల్చారు. ఆయన్ను హైదరాబాద్ తరలిస్తుండగా చనిపోయాడు.
- రాయికోడు మండలం ఇందూరుకు చెందిన నర్సమ్మ(50)కి ఛాతిలో నొప్పి ఉందని చెప్పడంతో జహీరాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్తుండగానే ఆమె మృతిచెందింది.
- నర్సాపూర్‌కు చెందిన రామకృష్ణ అనే వాటర్ ప్లాంటు నిర్వహకుడికి రాత్రి 12 గంటలకు గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స కోసం ఏర్పాట్లు చేస్తుండగానే ప్రాణం వదిలాడు.

సిద్దన్నపేటకు గుండెపోట్ల దడ

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం సిద్దన్నపేట గ్రామానికి గుండెపోట్ల దడ పట్టుకున్నది. రెండుమూడు నెలల్లోనే ఈ గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు గుండెపోటుకు గురికాగా ఇద్దరు చనిపోయారు. ఒకరికి ఓపెన్ హార్ట్ సర్జరీ, మిగతా వారికి స్టంట్లు పడ్డాయి. తొలుత చొప్పరి సిద్ధయ్య వ్యవసాయబావి వద్ద పనిచేసుకుంటూ కుప్పకూలి చనిపోయాడు. కొద్దిరోజులకే అనరాజుల ఎల్లయ్య, సంగు ఆంజనేయులకు గుండెనొప్పి రాగా ఆసుపత్రికి తరలించి నాళాలకు స్టంట్లు వేశారు. గత సంక్రాంతి సమయంలో మాజీ ఎంపీటీసీ బెదురు తిరుపతికి ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. ప్రస్తుతం కోలుకుంటున్నారు. ఇటీవల జనవరి 26న పరకాల భూపాల్‌రెడ్డికి గుండెపోటు రావడంతో స్టంటు వేసినప్పటికీ చనిపోయాడు. వెనువెంటనే చిలుకల రాజిరెడ్డికి ఛాతినొప్పి రాగా చికిత్స అనంతరం కోలుకున్నాడు. మరో యువకుడు కూడా ఇటీవల ఆసుపత్రిలో చేరడంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి.

ఇతని వయసు 41 ఏళ్లు.

- కోహీర్ మండలం దిగ్వాల్‌కు చెందిన బక్క రాములు(39) ఆటోడ్రైవర్. ఇతనికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నాడు. జనవరి 19న మధ్యాహ్నం ఇంటివద్ద ఆయనకు ఛాతిలో నొప్పి రావడంతో జహీరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాసేపటికే చనిపోయాడు.
- నారాయణఖేడ్‌కు చెందిన కమ్మరి సుదర్శనచారి(35) ఇటీవల కూలరగాయలు తీసుకొని ఇంటికి వెళ్లిన కాసేపటికే గుండెపోటుతో చనిపోయాడు. ఆయనకు ఎలాంటి సమస్యలు లేవు. నిత్యం సంతోషంగా ఉండేవాడని స్థానికులు తెలిపారు.
- కొమురవెల్లి మండలం మరిముచ్చాల గ్రామానికి చెందిన ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడు పాశికంటి అశోక్(45) ఈనెల 5న గుండెపోటుతో కుప్పకూలి చనిపోయాడు.
- తొగుట మండలం బండారుపల్లి గ్రామానికి చెందిన లింగంపల్లి బాల్‌రాజు అనే 30 ఏళ్ల యువకుడు ఇటీవలనే గుండెపోటుకు బలయ్యాడు.
- సిద్దిపేట పట్టణానికి చెందిన పుల్లూరి బాలకిషన్(40) జనవరి 24న గుండెపోటుతో చనిపోయాడు. అప్పటిదాకా యాక్టీవ్‌గా ఉన్న బాలకిషన్ ఒక్కసారిగా మృతిచెందడంతో అంతా దిగ్భ్రాంతి చెందారు.



బాలకిషన్(40), సిద్దిపేట





బాలరాజు(30),బండారుపల్లి, అశోక్(45), మరిముచ్చాల





సుదర్శన్(35), నారాయణఖేడ్, రాములు(39), దిగ్వాల్



ఆకులశ్రీనివాస్(48), జ్యోతి(43) దంపతులు, నార్సింగి

ఒత్తిడే ప్రధాన కారణం



పని ఒత్తిడి, ఇతర సమస్యల కారణంగా చాలామంది మానసికంగా కుంగిపోతున్నారు. ఇలాంటి సమస్యలను తట్టుకోవడానికి యోగా, ధ్యానం అవసరం. కనీసం రోజుకు ఒకగంట సమయాన్ని వ్యాయామానికి కేటాయించాలి. 8గంటలు పని, 8గంటలు నిద్ర, 8గంటలు ఇతర విషయాలకు వెచ్చించే విధంగా దినచర్య తయారు చేసుకోవాలి. నిపుణుల సలహాలు పాటిస్తూ వ్యాయామం, యోగా,, ధ్యానం చేయాలి. ఉత్సాహంగా, ఉల్లాసంగా జీవన విధానం ఉండేలా ప్రయత్నించాలి.

- తోట సతీశ్, యోగా గురువు, వ్యాసమహర్షి సొసైటీ

వ్యాయామం, ఆహారపు అలవాట్లపై దృష్టి



నిత్యం వ్యాయామం చేయాలి. శారీరక బరువును నియంత్రించుకోవాలి. దురలవాట్లకు దూరంగా ఉండాలి. శరీరంలో మార్పులు సంభవించినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలి. వైద్యుల సూచనలతోనే మందులు వాడాలి. ప్రస్తుత రోజుల్లో వయసుతో సంబంధం లేకుండానే గుండెపోట్లకు గురవుతున్నారు. అందుకే ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి. ఏ విషయంలోనైనా ఒత్తిడికి లోనుకావద్దు.

-సతీశ్ ఖాడ్సె, గుండెవైద్య నిపుణులు (లోహిత్‌సాయి ఆస్పత్రి)

కోల్‌కతా మ్యాచ్ మరుపురానిది

- సత్యసాయి సేవలు విశ్వవ్యాప్తం కావాలి
- మానవత్వమే సాయి తత్వం
- మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్



ఆపరేషన్ అయిన చిన్నారితో వీవీఎస్ లక్ష్మణ్

కొండపాక, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : తన క్రికెట్ జీవితంలో కోల్‌కతా మ్యాచ్ మరుపురానిదని మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ అన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాకలోని సత్యసాయి సంజీవని సెంటర్ ఫర్ చైల్డ్ హార్ట్ కేర్ రీసర్చ్ సెంటర్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. చిన్నారులను పలకరించి, ఆపరేషన్లు పూర్తి చేసుకున్న పిల్లలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఆసుపత్రి సిబ్బందితో వీవీఎస్ లక్ష్మణ్ కొద్దిసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుటుంబం వైద్య వృత్తిలో ఉన్నదని, కానీ తాను కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో క్రికెట్‌పై ఆసక్తి పెంచుకున్నానన్నారు. 134 టెస్ట్ మ్యాచులు ఆడి ఎంతో మంది అభిమానాన్ని చూరగొన్నానని అన్నారు. తనకు సచిన్ టెండూల్కర్ రోల్‌మోడల్ అని తెలిపారు. వృత్తి ధర్మాన్ని బాధ్యతగా నిర్వర్తించిన వారే సెలబ్రెటీ అవుతారని పేర్కొన్నారు. సత్యసాయి సేవా సంస్థలు అందిస్తున్న ఉచిత సేవలు విశ్వ వ్యాప్తం కావాలని వీవీఎస్ లక్ష్మణ్ ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ సేవాతత్వాన్ని అలవర్చుకోవాలని సేవలోనే సంతృప్తి ఉంటుందన్నారు. తనతో పాటు తన కుటుంబం సత్యసాయి ఆశీస్సులు పొందిన వాళ్లమేనని గుర్తుచేసుకున్నారు. ఎంతోమంది అభాగ్యులకు సాయి ఆశీస్సులు ఉన్నాయని పేర్కొన్నారు. మానవత్వమే సాయితత్వమని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ సేవా తత్వాన్ని అలవర్చుకోవాలని సేవలోనే సంతృప్తి ఉంటుందన్నారు. చిన్నపిల్లల ఆపరేషన్లు ఎంతో సున్నితమైనవని, సత్యసాయి ట్రస్ట్ అందిస్తున్న సేవలు ఎంతో గొప్పవని, ప్రేమ, సేవ అందిస్తూ పిల్లలను అక్కున చేర్చుకుంటున్నారని ఆయన ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతంలో ఇంత మంచి ఆసుపత్రిని ఏర్పాటు చేసి ఉచిత సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఆస్పత్రి చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ మనమంతా నిమిత్త మాత్రులమని, ఆ దేవుడే తమతో ఈ పని చేపిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాగిణి, స్వర్ణ, ఎన్‌టీపీసీ ప్రతినిధి పాణిగ్రహి, ఇన్ఫోసిస్ ప్రతినిధి వంశీ కృష్ణ, జగన్నాధశర్మ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ చేయిస్తాం

- పేద, మధ్య తరగతి ఆస్తుల పరిరక్షణకు కృషి : హైడ్రా కమిషనర్ రంగనాథ్
- ఐలాపూర్‌లోని వివాదాస్పద రాజగోపాల్‌నగర్ భూముల పరిశీలన
- కేసు హైకోర్టులో విచారణలో ఉండగా ఎలా వస్తారని కమిషనర్‌ను నిలదీసిన అడ్వకేట్



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న రాజగోపాల్‌నగర్ ప్లాట్ల బాధితులు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పేద, మధ్యతరగతి వర్గాలకు న్యాయం చేసేందుకు హైడ్రా, ప్రభుత్వం కట్టుబడి ఉందని, వివాదాస్పద భూములపై సమగ్ర విచారణ చేయించి న్యాయం చేస్తామని బాధితులకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ హామీ ఇచ్చారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్‌లో రాజగోపాల్‌నగర్ భూములను శుక్రవారం ఆయన పరిశీలించారు. నాలుగు దశాబ్దాల క్రితం ఐలాపూర్ భూముల్లో వేసిన లేఅవుట్‌లో ప్లాట్లు కొన్నవారు న్యాయం చేయాలని కోరుతూ హైడ్రా కమిషనర్‌కు పలుమార్లు వినతిపత్రాలను సమర్పించారు. ఈ క్రమంలో కమిషనర్ శుక్రవారం ఈ భూములను పరిశీలించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా ప్లాట్ల యజమానులు న్యాయం చేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు. కష్టార్జితంతో కొన్న ఇంటి స్థలం దక్కకుండా పోతోందని, న్యాయం కోసం పోరాడి వృద్ధులమయ్యామని హైడ్రా కమిషనర్‌ను వేడుకున్నారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ ఐలాపూర్ వివాదాస్పద భూములపై లోతైన దర్యాప్తు జరిపి రెండు నెలల్లో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ప్లాట్ల యజమానులకు హామీ ఇచ్చారు. అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామన్నారు.

కమిషనర్‌తో వాగ్వాదం

పలువురు గ్రామస్థులు కొందరు కమిషనర్ వద్దకు రావడంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకున్నది. గ్రామస్థుల తరఫున కోర్టుల్లో వాదిస్తున్న ఐలాపూర్‌కే చెందిన న్యాయవాది ఎంఏ ముఖీం హైడ్రా కమిషనర్‌కు పరిస్థితి వివరించే క్రమంలో వాగ్వాదం చోటు చేసుకున్నది. వివాదం కోర్టు పరిధిలోకి ఉండగా ఎలా గ్రామంలోకి వస్తారని కమిషనర్‌ను అడ్వకేట్ ప్రశ్నించారు. మీకు తెలుగు చదవడం వచ్చా అని అడ్వకేట్ అనడంతో కమిషనర్ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం, గౌరవం ఉందని సమస్యను తప్పుదారి పట్టించొద్దని మందలించారు. న్యాయసూత్రాలు తమకూ తెలుసని, అతిగా స్పందించకూడదని హెచ్చరించారు. గ్రామస్థులను రెచ్చగొట్టి లబ్ధిపొందాలని చూస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చక్రపురి కాలనీని స్థలాలను ఆయన పరిశీలించారు. 18 ఎకరాలు ఆక్రమణకు గురైందని ఇటీవల చక్రపురి కాలనీ వాసులు ప్రజావాణిలో కలెక్టర్‌కు, హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదులు చేయగా రంగనాథ్ స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చారు. అనంతరం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెంకటరమణ కాలనీని పరిశీలించారు.

చట్టాన్ని ధిక్కరించి పర్యటించారు : న్యాయవాది

ఐలాపూర్ గ్రామస్థుల భూముల కోసం దశాబ్దాలుగా కోర్టుల్లో న్యాయ పోరాటం చేస్తుండగా మరోవైపు హైడ్రా పేరుతో అక్రమంగా గ్రామస్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని న్యాయవాది ఎంఏ ముఖీం విమర్శించారు. హైకోర్టులో కేసు నడుస్తుండగా హైడ్రా కమిషనర్ చట్టాన్ని ధిక్కరించి గ్రామంలోకి ప్రవేశించారన్నారు. నెలరోజులుగా హైడ్రా సిబ్బంది గ్రామం చుట్టూ తిరుగుతున్నారని, గ్రామస్థులు వినతిపత్రాలను ఇచ్చేందుకు వస్తే కమిషనర్ వారి గోడును వినడం లేదన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ఈ చిన్నారులకు ఇక దిక్కెవరు?

- గతంలో తండ్రి, ప్రస్తుతం తల్లి మరణంతో అనాథలైన ఇద్దరు పిల్లలు
- విరాళాలతో తల్లికి అంత్యక్రియలు
- సంగారెడ్డి జిల్లా కేరూర్‌లో విషాదం



భూదెమ్మ మృతదేహాన్ని ట్రాక్టర్‌లో తీసుకెళుతున్న దృశ్యం

సంగారెడ్డి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఈ చిన్నారులకు ఊహ తెలియకముందే తండ్రి దూరమయ్యాడు. దీంతో అన్నీ తానై కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలను పోషిస్తున్న మాతృమూర్తి అంతలోనే మృతిచెందడంతో చిన్నారులు అనాథలైన ఈ విషాదకర ఘటన సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలంలోని కేరూర్‌లో చోటుచేసుకున్నది. గ్రామస్థుల కథనం ప్రకారం.. నిరుపేద కుటుంబానికి చెందిన బురగల భూదెమ్మ భర్త కొన్నాళ్ల క్రితం మృతిచెందాడు. దీంతో వారి ఇద్దరు కుమార్తెలు భాగ్య, భార్గవితో ప్లాస్టిక్ కవర్ కప్పిన ఓ పూరి పాకలో నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటూ భూదెమ్మ చిన్నారులను పోషిస్తున్నది. పిల్లలను గ్రామంలోని సర్కారు బడిలో చదివిస్తున్నది. కొన్ని రోజులుగా భూదెమ్మ అనారోగ్యానికి గురికాగా, శుక్రవారం పరిస్థితి విషమించి మృతిచెందింది. దీంతో ఆ ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారారు. స్థానికులు, యువజన సంఘం నాయకులు కలసి గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో భూదెమ్మ మృతదేహాన్ని తరలించి అంత్యక్రియలు నిర్వహింపచేశారు. అతిచిన్న వయసులోనే తల్లి అంత్యక్రియలు నిర్వహించేయడం ప్రతి ఒక్కరిని కలచివేసింది. తల్లిదండ్రులు లేక అనాథలుగా మారిన ఈ ఇద్దరి చిన్నారులను ఇకపై ఎవరు పోషిస్తారని గ్రామస్థులు విచారం వ్యక్తంచేశారు.



అనాథలైన భాగ్య, భార్గవి

ఉత్సాహంగా ప్రమాణ



గీతంలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రమాణ-2025 ఉత్సాహంగా కొనసాగింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు రుద్రారంలోని 'గీతం'లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న వార్షిక ఉత్సవం శుక్రవారం ప్రారంభమైంది. వేడుక ప్రారంభోత్సవంలో ఎస్‌వైఎస్ వైసీఎస్ గ్రూపు ముఖ్య కార్యనిర్వహణాధికారి, వ్యవస్థాపకుడు శ్రహంజ్ ఆత్మీయఅతిథిగా విచ్చేసి ఉపన్యసించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఆర్ శాస్త్రి, అధ్యాపకులు, విద్యార్థులు వేడుకలో పాల్గొన్నారు.

పాఠశాలలకు పరిశీలన బృందాలు

- టెన్త్ ఎఫ్ఏ మార్కుల రికార్డుల పరిశీలన
- 20 వరకు పూర్తి చేయాలని ఆదేశం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల రికార్డుల పరిశీలనకు విద్యాశాఖ మానిటరింగ్ బృందాలను ఏర్పాటు చేసింది. ఈ నెల 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అన్ని పాఠశాలలను సందర్శించి రికార్డుల పరిశీలన పూర్తి చేయాలని ఆదేశించింది. పదో తరగతి విద్యార్థులకు సంబంధించి ఎఫ్ఏ-1(ఫార్మేటివ్ అసెస్‌మెంట్) నుంచి ఎఫ్ఏ-4 వరకు ప్రతీ సబ్జెక్టుకు విద్యార్థులకు కేటాయించే 20 మార్కుల రికార్డులను బృందం సభ్యులు పరిశీలించనున్నారు. 20 మార్కుల్లో స్లిప్ టెస్టుకు 5 మార్కులు, ప్రాజెక్టు వర్కుకు 5 మార్కులు, నోట్ బుక్ రైటింగ్‌కు 5 మార్కులు, పుస్తక సమీక్షకు 5 మార్కులు కేటాయిస్తారు. అయితే విద్యార్థులు సరిగ్గా రాసినా, రాకపోయినా, ఉపాధ్యాయులు ఎక్కువగా లేదా తక్కువ మార్కులు కేటాయించినా వాటిని పరిశీలన బృందాలు సరిచేస్తారు. వార్షిక పరీక్షలో ఒక్కో సబ్జెక్టుకు 80 మార్కుల రాత పరీక్ష నిర్వహించగా వచ్చిన మార్కులను ఈ 20 మార్కుల కోసం బృందాలు పరిశీలన చేసిన తర్వాత వెబ్‌సైట్‌లో నమోదు చేసిన మార్కులు కలుపుతారు.

సంగారెడ్డి జిల్లాలో 467 పాఠశాలలు

సంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పదో తరగతి పాఠశాలలు 467 ఉన్నాయి. ఎఫ్ఏ మార్కుల రికార్డుల పరిశీలనకు విద్యాశాఖ సుమారు 70 బృందాలు ఏర్పాటు చేసింది. ఒక్కో బృందంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడితో పాటు ఒక లాంగ్వేజ్ టీచర్, నాన్ లాంగ్వేజ్ టీచర్ ఉంటారు. ఒక్కో బృందానికి మూడు నుంచి ఏడు పాఠశాలల పరిశీలన బాధ్యతలు అప్పగించారు. బృందం సభ్యులు పరిశీలించిన పాఠశాల మార్కుల జాబితాను 21 వ తేదీ నుంచి సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. అనంతరం మార్కుల జాబితాను సంబంధిత మండల విద్యాధికారుల కార్యాలయాల్లో అందజేయాలి.

మంచినీళ్ల సరస్వతీరామశర్మకు నోరి పురస్కారం



సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కవి సామ్రాట్ నోరి నరసింహశాస్త్రి 126వ జయంతి సందర్భంగా అందజేస్తున్న నోరి సాహిత్య పురస్కారానికి సిద్దిపేటకు చెందిన కవయిత్రి మంచినీళ్ల (త్రిగుళ్ల) సరస్వతిరామశర్మ ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 9న హైదరాబాద్ ఉప్పల్‌లోని శ్రీకళ్యాణానంద భారతి క్షేత్రంలో అందజేస్తారన్నారు. సాహిత్యంతో పాటు ఆధ్యాత్మికంగా కృషి చేస్తున్న మంచినీళ్ల సరస్వతి రామశర్మ నోరి సాహిత్య పురస్కారానికి ఎంపిక కావడం పట్ల సిద్దిపేటలో సాహితీవేత్తలు వేలేటి మృత్యుంజయశర్మ, రుక్మాభట్ల నృసింహశర్మ, చెప్పెల హరినాథ్ శర్మ, ఉండ్రాళ్ళ రాజేశం, సింగీతం నరసింహరావు, వరుకోలు లక్ష్మయ్య, బస్వరాజ్ కుమార్, లింగేశ్వర శర్మ, తాటికొండ శివకుమార్, ఉస్మాన్ అనూరాధ, వీరారెడ్డి అభినందనలు తెలియజేశారు.

కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

చిన్నకోడూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచాపూర్ శివారులో రంగనాయకసాగర్ రిజర్వాయర్ ఎడమ కాలువ కింద ఉన్న ఎల్ఎస్ఎం-3 కాలువ ద్వారా ఎల్లాయిపల్లి గండిచెరువులోకి నీటిని వదలడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం మాచాపూర్ శివారులో ఎల్లాయిపల్లి, మాచాపూర్ రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రామకోటి సంస్థ ఆధ్వర్యంలో రామ, శివ లిఖిత యజ్ఞం

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలంలోని గ్రామగ్రామాన నిర్వహిస్తున్న రామ, శివ లిఖిత మహాయజ్ఞంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. శుక్రవారం శ్రీరామకోటి భక్తసమాజం సంస్థ ఆధ్వర్యంలో కృష్ణాలయంలోని రామాలయం వద్ద 2గంటల పాటు రామరామ స్మరణ మధ్య రామ, శివ నామాలను లిఖించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శృంగేరి పీఠం వారికి రామకోటి సంస్థ ద్వారా కోట్లాది లిఖిత సంఖ్యను త్వరలో అందజేస్తామని తెలిపారు.

ఘనంగా రమాబాయి జయంతి

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రమాబాయి 127వ జయంతిని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గజ్వేల్ ఎస్టీ హాస్టల్ విద్యార్థుల సమక్షంలో రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

టీజీయూఈఈయూ నూతన డైరీ ఆవిష్కరణ

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని శుక్రవారం సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌లో ఆవిష్కరించినట్లు యూనియన్ జిల్లా జనరల్ సెక్రటరీ కనకరాజు తెలిపారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు ప్రభుత్వం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట సెక్షన్ల యూనియన్ జనరల్ సెక్రటరీ కరుణాకర్‌గౌడ్, నాయకులు భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్,జీ.రాజు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నరేష్

ములుగు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం దాసర్లపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడి ఎన్నిక మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం దాసర్లపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించగా ఖైదారం నరేష్ ఎన్నికయ్యారు.కార్యక్రమంలో మండల కార్యదర్శి కొమ్ము నవీన్ పాల్గొన్నారు.

చెల్కలపల్లి గ్రామస్థుల పై బీఆర్ఎస్ మొసలి కన్నీరు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చెల్కలపల్లి గ్రామస్థులపై బీఆర్ఎస్ నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని కాంగ్రెస్ నాయకులు మీసం మహేందర్ యాదవ్ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని చెల్కలపల్లి గ్రామాన్ని కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అదనపు టీఎంసీ కాలువ నిర్మాణపనుల్లో భాగంగా చేపట్టిన బ్లాస్టింగ్‌లతో ఇళ్లకు బీటలు వారుతున్నాయని గ్రామస్థులు ధర్నా చేస్తే బీఆర్ఎస్ నాయకులు పోలీసులతో అరెస్టు చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పరశురాం, భూపతిరెడ్డి, జయంత్, ప్రశాంత్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరీమాతకు విశేషపూజలు

చేర్యాల, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలోని నారసింహ గురుస్థానం భువనేశ్వరీ మందిరంలో కొనసాగుతున్న శైశిర మాఘనవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. శుక్రవారం కావడంతో పొరుగు ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

నేటి నుంచి విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవాలు

- శాస్త్రోక్తంగా భ్రమరాంబికా కేతమ్మ సమేత మల్లికార్జునస్వామి విగ్రహాల ప్రతిష్ఠకు సన్నాహాలు
- వర్గల్‌లో 4 రోజులుపాటు వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి
- హాజరు కానున్న ప్రముఖులు




వర్గల్‌లో నూతనంగా నిర్మించిన మల్లికార్జునస్వామి ఆలయం, కొలువుదీరనున్న మల్లన్నస్వామి విగ్రహం

వర్గల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వర్గల్ మండల కేంద్రంలో ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు శ్రీ కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీ భ్రమరాంబిక, కేతమ్మ సమేత మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు జరగనున్నాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు భక్తులు వేలాదిగా తరలి రానున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఉత్సవాల తీరు ఇలా..

ఈ నెల 8న ఉదయం 8 గంటలకు విగ్రహ గ్రామోత్సవం (ఊరేగింపు), 9న ఉదయం గోపూజ, గురువందనం, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగ్రవ్యప్రాశన. అఖండ దీపారాధన, కలశస్థాపన, సాయంత్రం ఆవాహిత దేవతాపూజలు, అగ్నిప్రతిష్ఠాపన, గణపతి, శ్రీరుద్రసహిత ఆవాహిత దేవాతా హోమాలు, రాత్రి ధ్వజస్థాపన కార్యక్రమాలుంటాయి. 10వ తేదీ ఉదయం గణపతి పూజ, ప్రాతఃకాల పూజలు, విగ్రహ ప్రతిష్ఠ, బలిహరణం, మహా పూర్ణాహుతి, పండిత సత్కారాలు, మధ్యాహ్నం అగ్ని గుండాల ప్రవేశం, సాయంత్రం శ్రీమల్లన్న స్వామికి బండ్లు తిప్పే కార్యక్రమం, బోనాలు ఉంటాయి. 11వ తేదీన మధ్యాహ్నం ఒగ్గుకథ, సల్లలు చేయుట, కొండపోచమ్మకు బోనాలు సమర్పించడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

వేడుకలకు విచ్చేయనున్న ప్రముఖులు

నాలుగు రోజులపాటు జరిగే ఉత్సవాలకు రావాలని కోరుతూ వర్గల్ మండలం కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో మాజీ జడ్పీటీసీ బాలు యాదవ్ శుక్రవారం ఎర్రవల్లి ఫౌంహౌస్‌లో మాజీ సీఎం కేసీఆర్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆయనతో పాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, వర్గల్ విద్యాధరి క్షేత్రం వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి వేడుకలకు హాజరు కానున్నట్లు మాజీ జడ్పీటీసీ బాలు యాదవ్, కార్యక్రమ నిర్వాహకుడు పెద్దగొల్ల యాదయ్య వివరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉత్సవ ఏర్పాట్లు పూర్తి చేశామని వారు వెల్లడించారు.

విద్యార్థులు కొత్త చట్టాలను తెలుసుకోవాలి

● జిల్లా లీగల్ సర్వీసెస్ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి స్వాతిరెడ్డి

కుకునూరుపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నేరస్థుల్లో మార్పు కోసమే శిక్షలు, చట్టాలు అని, విద్యార్థులకు మార్కులు ఎప్పుడు కొలమానం కాదని జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి తెలిపారు. శుక్రవారం కుకునూరుపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జిల్లా లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కొత్త చట్టాల గురించి తెలుసుకోవాలని, లేదంటే ఇబ్బందులు ఎదురవుతాయని సూచించారు. ఫోక్సో, చైల్డ్‌లేబర్, చైల్డ్ మ్యారేజ్, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. పుస్తకమే విద్యార్థికి మంచి స్నేహితుడని సినిమాలు, సోషల్ మీడియా, ఫోన్ ప్రభావంతో జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. ఎప్పుడు మార్కుల కోసం పోటీ పడకుండా ప్రతిభను, జ్ఞానాన్ని పెంచుకునే విధంగా చదువుకోవాలని సూచించారు. మంచి మార్కులు రాలేదని ఆత్మహత్యలకు, ఇతర ప్రయత్నాలకు పాల్పడవద్దని తెలిపారు. అన్ని చట్టాలు రాజ్యాంగానికి లోబడే ఉంటాయని, రాజకీయ నాయకులు, జడ్జిలు, పోలీసులు, న్యాయవాదులు అందరూ రాజ్యాంగాన్ని పాటించాల్సిందేనని ఏ ఒక్కరికి అతీతం కాదన్నారు. ఇండియాలో కఠిన శిక్షలు తక్కువ అని, నేరస్థులలో మార్పు కోసమే చట్టాలను రూపొందించినట్టు వివరించారు. కార్యక్రమంలో తొగుట సీఐ లతీఫ్, ఎంఈవో బచ్చలి సత్తయ్య, ఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బల్బుల తయారీపై విద్యార్థులకు శిక్షణ



బల్బుల తయారీపై శిక్షణనిస్తున్న మల్లేశం

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని క్రాంతి హైస్కూల్‌లో విద్యార్థులకు బల్బు తయారీపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు రిసోర్స్ పర్సన్‌గా తెలంగాణ ఇన్నోవేటర్ అవార్డు గ్రహీత సెన్సార్ మల్లేశం వ్యవహరించారు. ఆయన విద్యార్థులకు ఎల్ఈడీ బల్బుల తయారీపై ప్రాక్టికల్ శిక్షణ అందించారు. విద్యార్థులకు విద్యుత్ సర్క్యూట్లు, వైరింగ్, ఎల్ఈడీ బల్బుల తయారీ గురించి ప్రాక్టికల్ ట్రైనింగ్ అందించారు. స్కూల్ చైర్‌పర్సన్ అర్పిత మాట్లాడుతూ, ఇలాంటి ఆచరణాత్మక అనుభవం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తుందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ భగవాన్ రెడ్డి మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోగలరని పేర్కొన్నారు. సెన్సార్ మల్లేశం తన అనుభవాలను పంచుకుంటూ, చేతులతో చేసి నేర్చుకోవడం ఎంతో ముఖ్యమని, ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు తమ సృజనాత్మకతను మెరుగుపర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ముగిసిన అవగాహన శిబిరం



మాట్లాడుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమ్మన రాజప్రభాకర్‌రెడ్డి

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పీఎం ప్రీ స్కూల్స్ ఫేజ్-2, గర్ల్ చైల్డ్ ఎంపవర్మెంట్ క్లబ్ ఏర్పాటులో భాగంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులకు వివిధ అంశాల పట్ల అవగాహన కల్పించారు. 5 రోజులపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమ్మన రాజప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ అవగాహన శిబిరంలో బాలిక సాధికారత సంఘాల ఏర్పాటు, ఆర్థిక అక్షరాస్యత, చట్టపరమైన అక్షరాస్యత, రుతుక్రమ ఆరోగ్యం, పరిశుభ్రత జీవన నైపుణ్యాలు, నమ్మదగిన పెద్దవారు, నిర్ణయం తీసుకునే నైపుణ్యం, సంఘర్షణ పరిష్కార మార్గాలు వంటి తదితర అంశాలపై విద్యార్థులకు ఆయా రంగాల వారితో అవగాహన కల్పించారు. అవగాహన కల్పించిన వారందరికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమ్మన రాజప్రభాకర్ రెడ్డి సత్కరించారు.

షాంపూలు, డైపర్లు యూజీడీలో వేయొద్దు

గజ్వేల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): షాంపూలు, డైపర్స్ శానిటరీ ప్యాడ్లను యూజీడీ సబ్ చాంబర్‌లో వేయవద్దని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య పట్టణ ప్రజలను కోరారు. గజ్వేల్ పట్టణంలోని ఆయా వార్డుల్లో నెలకొన్న యూజీడీ సమస్యలను జట్టింగ్ మిషన్ ద్వారా శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు యూజీడీ సబ్ చాంబర్‌లో ఎలాంటి ప్లాస్టిక్ పదార్థాలను వేయవద్దని కోరారు. ప్రజలు ఇందుకు సహకరించాలని తెలిపారు. అలాగే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ప్రజలకు విక్రయించవద్దని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నరసయ్య వ్యాపారులకు ఆదేశించారు. పట్టణంలోని ఆయా హోల్‌సెల్ ప్లాస్టిక్ దుకాణాలలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తనిఖీలు నిర్వహించి, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విక్రయిస్తున్న ఆయా దుకాణ యజమానులకు జరిమానా విధించి, లైసెన్సులను రద్దు చేశారు.

సకాలంలో ఇంటి పన్ను చెల్లించాలి

దుబ్బాక,ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నును సకాలంలో చెల్లించాలని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దుబ్బాకలోని 13,14,18వవార్డుల్లో నిర్వహిస్తున్న ఇంటి పన్ను వసూళ్ల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలోని ఆయా వార్డుల్లో పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు. వ్యాపారులు కచ్చితంగా ట్రేడ్ లైసెన్స్‌లను తీసుకోవాలని సూచించారు.



శిక్షణలో ప్రీస్కూల్ నిర్వాహణపై వివరిస్తున్న సీఆర్పీలు

ప్రీ స్కూల్‌పై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

మద్దూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రీస్కూల్ నిర్వాహణపై అంగన్‌వాడీ టీచర్లకు మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమంలో సీఆర్పీలు భార్గవి, మౌనిక, రజిత, నర్సింహారెడ్డి మాట్లాడారు. పిల్లల మేధోవికాసంతో పాటు శారీరక అభివృద్ధి, బాషాభివృద్ధి, రంగుల గుర్తింపుతో పాటు అనేక అంశాలపై అంగన్‌వాడీ టీచర్లకు వివరించారు.

వర్గల్‌లో కేన్సర్ నిర్ధారణ శిబిరం



కేన్సర్ వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న తూంకుంట నర్సారెడ్డి

వర్గల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవాసంస్థలు నిరుపేదలకు అండగా ఉంటూ, నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం వర్గల్ మండల కేంద్రంలో శ్రీసత్యసాయి సేవాసంస్థలు తెలంగాణ మహిళావిభాగం ఆధ్వర్యంలో ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి నేతృత్వంలో ఉచితంగా కేన్సర్ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నర్సారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సత్యసాయి సేవాసంస్థ వారు నిర్వహిస్తున్న కేన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు, మహిళావిభాగం సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొమురవెల్లిలో శివాజీ విగ్రహావిష్కరణ



శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న యువకులు

చేర్యాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలకేంద్రంలో పలువురు యువకులు గురువారం రాత్రి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. మల్లన్న ఆలయానికి చేరువలో గల చెరువు పార్కింగ్ సమీపంలో రోడ్డుపక్కన గంటల వ్యవధిలోనే విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రాత్రి వరకు ప్రధానదారి బోసిపోయి ఉండగా, తెల్లవారేసరికి శివాజీ విగ్రహంతో కళకళలాడుతూ కనిపించడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ నెల 19న శివాజీ జయంతిని పురస్కరించుకుని గ్రామానికి చెందిన యువకులు విగ్రహాన్ని నెలకొల్పి శివాజీపై మమకారాన్ని చాటుకున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

సిద్దిపేట రూరల్,ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నో హామీలను ఇచ్చి విఫలమైందని, కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలని పీఏసీఎస్ చైర్మన్ నల్ల నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండలం చింతమడక, అంకంపేట, దమ్మచెరువు గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎర్ర యాదయ్య, మాజీ సర్పంచులు కిషన్‌రెడ్డి, హంసకేతన్‌రెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ప్రభాకర్ వర్మ, నాయకులు మోహన్ రెడ్డి, చందర్‌రావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

మద్దూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అమలుకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ మద్దూరు మండల పార్టీ అధ్యక్షుడు మేక సంతోష్ అన్నారు. శుక్రవారం మండలంలోని లద్నూరులో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా ఏమిటో చూపించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమలతమల్లేశం, అబ్జర్వర్ ముత్యాల నాగేశ్వర్‌రావు, గ్రామశాఖ అధ్యక్షుడు నంద శ్రీను, మాజీ సర్పంచ్ జీడికంటి సుదర్శన్, సొసైటీ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, కొమురవెల్లి దేవస్థానం మాజీ డైరెక్టర్ కనకరాజుతో కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగపురిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు

చేర్యాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగపురి గ్రామంలో రాజరాజేశ్వరస్వామి ఆలయంలో నవగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలు నేటి నుంచి మూడురోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్నిఏర్పాట్లు చేశారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఆరుగురికి జరిమానా.. ఒకరికి జైలు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించగా ఆరుగురు వాహనదారులు మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా విచారణ అనంతరం నిందితులకు రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. అందులో ఓ వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష విధించారు.

ఎక్సైజ్ కేసులో పట్టుబడిన కారుకు ఈ నెల 11న వేలం

సిద్దిపేట రూరల్,ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి); పోలీసు స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసులో పట్టుబడిన హెడాయ్ క్రిటా కారును ఈ నెల 11న వేలం వేయనున్నట్లు సిద్దిపేట రూరల్ ఎస్ఐ గుడా అపూర్వరెడ్డి శుక్రవారం తెలిపారు. ఎక్సైజ్ సీఐ ఆధ్వర్యంలో సిద్దిపేట రూరల్ పోలీసు స్టేషన్ అవరణలో ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. రూ. రూ.4.55లక్షల విలువ చేసే హెడాయ్ క్రిటా (టీఎస్36ఏ 3939)కారును వేలం వేస్తున్నట్లు చెప్పారు. కారును దక్కించుకున్న విలువపై 18 శాతం జీఎస్టీ ఉంటుందన్నారు. అసక్తి గలవారు ఈ నెల 11న వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సాయం



విద్యార్థులకు నోటు పుస్తకాలు పెన్నులు అందజేస్తున్న దాత నవీన్‌రావు

మర్కుక్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త మండలంలోని అంగడికిష్టాపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించి ఉదారత చాటుకున్నారు. మర్కుక్ మండలంలోని అంగడి కిష్టాపూర్‌కు చెందిన కళ్లెపు నవీన్‌రావు వ్యాపార రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. శుక్రవారం ఆయన తన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించేందుకు స్వగ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా నవీన్‌రావు తన సోదరుడైన చెప్యాల రాజేశ్వరరావుతో కలిసి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పుల్లారెడ్డి, మిఠాయిలు అందించారు. ఈ పాఠశాల అద్భుతమైన రీతిలో పని చేస్తూ రాష్ట్ర స్థాయిలోనే గుర్తింపు తెచ్చుకోవడం తనకు సంతోషాన్నిచ్చిందన్నారు. పాఠశాలకు తనవంతు సాయంగా 6సీసీ కెమెరాల ఏర్పాటుకు అవసరమైన రూ. 30వేల విలువైన చెక్కును హెచ్ఎం బాలకృష్ణకు అందజేశారు. వెంట మాజీ సర్పంచ్ రాములు గౌడ్, ఎస్ఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ కనకయ్య, ఉపాధ్యాయులు హారిక, సంతోషిమాత, చిన్ని కృష్ణ తదితరులున్నారు.

విద్యార్థులకు అందమైన చేతిరాతపై శిక్షణ



విద్యార్థులకు నోటు పుస్తకాలు పెన్నులు అందజేస్తున్న దాత నవీన్‌రావు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందమైన చేతిరాతపై శిక్షణ అందించారు. పొన్నాల గ్రామస్థులు దారబోయిన సంపత్ యాదవ్, పెండ్యాల శ్రీనివాస్‌రెడ్డిలు ఒక్కో విద్యార్థికి రూ.150 విలువ చేసే మొత్తం రూ.15వేల విలువైన చేతిరాత పుస్తకాలను విద్యార్థినీ విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా చేతిరాత నిపుణుడైనన ఎజాజ్ అహ్మద్‌తో చేతిరాతపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ చేతిరాత ద్వారా వ్యక్తిలోని అసాధారణ ప్రతిభాపాటవాలు వెలికి తీయవచ్చని తెలిపారు. చదవడం ఎంత ముఖ్యమో తప్పులు లేకుండా గుండ్రంగా అందంగా రాయడం అంతే ముఖ్యమని చెప్పారు. ఈ సందర్భంగా ఏజాజ్ అహ్మద్ తన అమూల్యమైన సమయాన్ని కేటాయించి విద్యార్థులకు చక్కని చూచిరాత మెళకువలు నేర్పినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్ చారి, సౌజన్య సుధా, శ్రీవిద్య, స్వప్న, స్వప్న, శిరీష, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా లలిత



లలితకు నియామకపత్రాన్ని కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు

మద్దూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా వల్లంపట్ల గ్రామానికి చెందిన గుండెగోని లలితామల్లేశం నియామకమయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు నియామకపత్రాన్ని శుక్రవారం గాంధీభవన్‌లో అందించారు. ఎంతో నమ్మకంతో తన నియామకానికి సహకరించిన జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి, సిద్దిపేట జిల్లా మహిళా అధ్యక్షురాలు ముదం లక్ష్మీ, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుల గొంతుకను మండలిలో వినిపిస్తా



ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యకు మద్దతుగా పత్రాన్ని అందజేస్తున్న తపస్ నాయకులు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే శాసన మండలిలో ఉపాధ్యాయుల గొంతుక వినిపిస్తా అని కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్, మెదక్ జిల్లాల బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య అన్నారు. సిద్దిపేటలో నిర్వహించిన తపస్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు ఆధ్వర్యంలో నాయకులు ఆయనకు మద్దతును తెలుపుతున్నట్లుగా లేఖను అందజేశారు. అనంతరం బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతు పలికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో రఘువర్ధన్ రెడ్డి, మురళి ధర్, నర్సారెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తా



వేంకటేశ్వర ఆలయంలో నామినేషన్‌పై సంతకం చేస్తున్న మహేందర్ రెడ్డి

నంగునూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తనను గెలిపిస్తే విద్యారంగ, ఉపాధ్యాయ, సమాజ సేవకు పునరంకితం అవుతానని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వంగ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలికి పీఆర్టీయూ తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వంగ మహేందర్ రెడ్డి, కవిత దంపతులు కోనాయిపల్లిలోని సెంటిమెంట్ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఆర్టీయూ ఇతర సంఘాల కార్యకర్తలతో కలిసి ర్యాలీగా కరీంనగర్ వెళ్లి నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తున్నట్లు తెలిపారు. వెంట మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి, పీఆర్టీయూటీఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి పుల్లం దామోదర్‌రెడ్డి, ఉన్నారు.